క్లుప్తంగా

నేడు, రేపు తైబజార్‌ల వేలం

దహెగాం: మండల కేంద్రంతో పాటు, కుంచవెల్లి గ్రామంలోని వారసంతల వేలం నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాకేశ్, ప్రణీత్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుంచవెల్లిలోని వారసంతకు నేడు, మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతకు రేపు ఆయా పంచాయతీ కార్యాలయల్లో వేలం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్1 వారసంత వేలం మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంతకు స్థానిక గ్రామ పంచాయతీలో మంగళవారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు రూ.30వేలు డిపాజిట్ చేయాలన్నారు. వివరాలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వారసంత వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి భీమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు పాల్గొనాలని ఆయన సూచించారు.

చినరాస్పెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు



సీమంతం చేస్తున్న ఎంపీపీ సులోచన

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ కంబగౌని సులోచన హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శోభ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం సద్వినియోగం చేసుకోండి

జన్నారం: మహిళలకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. భవననిర్మాణ కార్మికుల కుటుంబాలకు చెందిన 25మంది మహిళలకు ఉచితంగా 90రోజులు శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఈ శ్రమ్ కార్డును తీసుకోవాలని సూచించారు. మండలంలోని మహ్మదబాద్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా లేబర్ అధికారిని భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల్ల ప్రభాకర్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభుదాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిరుపతి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : బలగం

కాగజ్‌నగర్

వెంకటరమణ : బలగం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

ఏటీఎం సెంటర్ లేక తిప్పలు



మండల కేంద్రంలోని బ్యాంకు వద్ద డబ్బుల కోసం వేచి ఉన్న జనం (ఫైల్)

- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి నష్టపోతున్న జనం
- మండలంలో 10వేలకు పైగా ఖాతాదారులు
- ఏటీఎం ఏర్పాటు చేయాలని డిమాండ్

తిర్యాణి: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. కానీ నగదును విత్‌డ్రా చేసేందుకు మండలంలో ఒక్క ఏటీఎం సెంటర్ కూడా లేకపోవడంతో రైతులతో పాటు సామాన్య జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బుల కోసం బ్యాంకు ఎదుట ఖాతాదారులు రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో 29 గ్రామపంచాయతీలు, 114 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. మండల కేంద్రంలో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దాదాపు పది వేలకు పైగా ఖాతాలున్నాయి. మండల వ్యాప్తంగా ఒకే బ్యాంకు ఉండటం, ఏటీఎం సెంటర్ లేకపోవడంతో మండల వాసులకు నగదు కష్టాలు తప్పడం లేదు.

పదుల సంఖ్యలో మైక్రో ఏటీఎంలు..

మండల కేంద్రంతో పాటు మండలానికి దాదాపు 30 కిలోమీటర్ల పరిధిలో కూడా ఏటీఎం సెంటర్లు సైతం లేవు. దీంతో ఖాతాదారులు అవసరాన్ని ఆసరాగా వాడుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు పదుల సంఖ్యలో మినీ ఏటీఎంలు ప్రారంభించారు. ఖాతాదారుల వేలిముద్రల ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి వారికి అందజేస్తున్నారు. ఇందుకోసం కొంత శాతం కమిషన్ సైతం తీసుకుంటున్నారు. కాగా మండలంలో అధికంగా నిరాక్షరాసులు ఉండడంతో మైక్రో ఏటీఎం సెంటర్ల నిర్వాహకులు మోసం చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఖాతాదారులకు తెలియకుండా నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకుంటున్నారని పోలీసులకు గతంలో పలు ఫిర్యాదులు కూడా అందాయి. కాగా మండల కేంద్రంలో బ్యాంకు ఏటీఎం ఏర్పాటు చేయడం ద్వారా ఖాతాదారుల కష్టాలు తీరుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఉన్న ఏకైక బ్యాంకు వద్ద సైతం ఏటీఎం సెంటర్ లేకపోవడంతో అత్యవసరమైన సమయంలో బ్యాంకు మూసి ఉన్న సమయంలో నగదు విత్‌డ్రాకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మండలంలో ఏటీఎం సెంటర్‌తో పాటు మరో బ్యాంకును ఏర్పాటు చేయాలి. – గట్టయ్య, నాయకపుగూడ

చాలా ఇబ్బందిగా ఉంది



అత్యవసరంగా డబ్బులు కావాలంటే విత్‌డ్రా చేసుకోవడం చాలా ఇబ్బందిగా ఉంది. బ్యాంకు వద్దకు వెళ్తే పదుల సంఖ్యలో ఖాతాదారులు ఉంటున్నారు. మైక్రో ఏటీఎం సెంటర్ వద్ద రోజుకు రూ.పది వేల కన్నా ఎక్కువ విత్‌డ్రా చేసుకునేందుకు వీలు లేదు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – వెంకటేశ్, వ్యాపారి, తిర్యాణి

సీతారాముల కల్యాణ మహోత్సవం జయప్రదం చేయండి



మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో ఈనెల 30న అంగరంగ వైభవంగా నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ పత్రికను ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం భద్రయ్య, చిలుకూరి రవి, యాదగిరి, గాజుర్ల శైలేందర్, తిరుపతి, గుండు రమేష్, చిప్ప సురేష్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో గల శ్రీ కోదండ రామాలయంలో ఈ నెల 30న శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బట్టమేకల గట్టయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 12.15 గంటలకు సీతాదేవి, రాములవారి కల్యాణం జరుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



విద్యార్థులతో అనిత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు విద్యాపీఠం జిల్లా అధ్యక్షురాలు కొత్తపెల్లి అనిత సోమవారం పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరా లను చేరాలని ఆకాంక్షించారు. దక్షిణ మధ్య క్షేత్రప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, గోవిందరావు, పూదరి సత్యనారాయణ, బోనగిరి సతీశ్‌బా బు, వెంకన్న, శ్రీనివాస్, వేణుగోపాల్, కల్లూరి సంతోశ్, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ జాజిమొగ్గ సుజాత

పెంచికల్‌పేట్: సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ జాజిమొగ్గ సుజాత సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మురళీగూడ గ్రామంలో గత వారం రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయిందని సర్పంచ్ ఈశ్వరీబాయి సభ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఏఈ మనోహర్ రెండు రోజుల్లో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. పోతెపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కూలీలకు డబ్బులు రాలేదని సర్పంచ్ చంద్రమౌళి, ఎల్లూర్ గ్రామపంచాయితీలో ఎన్ఆర్ఈజీఎస్ 40 మస్టర్ల డబ్బులు కూలీలకు చెల్లించడంలో అధికారుల జాప్యంపై కోఆప్షన్ సభ్యుడు సాజీద్ సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఏపీవో సతీష్ నెలాఖరులోగా కూలీల నగదు జమచేస్తామన్నారు. అనంతరం ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలను సభకు వినిపించారు. సమావేశంలో వైస్ఎంపీపీ కమల, ఎంపీడీవో గంగాసింగ్, తహసీల్దార్ సరిత, ఏడీఏ రాజుల నాయుడు, ఎంపీటీసీ రాజన్న, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల మాలధారణ



మాలధారణ చేస్తున్న జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో ఆంజనేయస్వామి దీక్షలు చేపట్టారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర అభిషేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావ్ 30వసారి మాలధారణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ధర్మపురి వెంకటేశ్వర్లు, పిన్నా వివేక్, గుండా వెంకన్న, గడ్డల కిరణ్, తదితరులు ఉన్నారు.

గుడ్లబోరిలో పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామ సమీపంలో గల బీర్య హనుమాన్ మందిర్ ఆధ్వర్యంలో భక్తులు శ్రీరాముని పల్లకి సోమవారం ఊరేగించారు. ఆలయ అర్చకుడు మారుతి మహరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని వైగాం, గుడ్లబోరి, జనగాం గ్రామాల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు పర్చాకే బండు, సాయినాథ్, కాళిదాస్, ఆత్మరాం, భక్తులు పాల్గొన్నారు.

వారసంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల: మండల కేంద్రంలోని మున్నెవార్ సేవా సంఘం భవనం ఎదుట సోమవారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సోమవారం వారసంత రోజు సంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం అన్నదానం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సేవా సమితి సభ్యులు ప్రకాంత్, మణిరాం, సాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం గ్రామంలో నిర్మిస్తున్న సీసీరోడ్లను సోమవారం ఎంపీడీవో గౌరీశంకర్ పరిశీలించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం కోయవాగు గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. మండువ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నీటి నిల్వ కుంటను పరిశీలించారు. ఆయన వెంట కోయవాగు సర్పంచ్ లక్ష్మి, ఈజ్‌గాం ఎంపీటీసీ కుమార్, తదితరులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీవో

కెరమెరి: నర్సరీలో పెరుగుతున్న మొక్కలను వంద శాతం సంరక్షించాలని నర్సరీ నిర్వాహకులకు ఈజీఎస్ ఏపీవో మల్లయ్య సూచించారు. బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి, కరంజివాడ గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. వేసవి కాలంలో అధిక మంది కూలీలు ఉపాధి పనులు చేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట టీఏ మహేందర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

కెరమెరి తహసీల్దార్‌గా సమీర్



ఎండీ సమీర్

కెరమెరి: కెరమెరి మండల తహసీల్దార్‌గా ఎండీ సమీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎస్.సాయన్న కౌటాలాకు బదిలీ కాగా, సిర్పూర్(టి)లో విధులు నిర్వహించిన సమీర్ ఇక్కడికి వచ్చారు. కాగా ఆరు నెలలవ్యవధిలోనే సాయన్న బదిలీ కావడం గమనార్హం.

పనుల ఎజెండాపై సమీక్ష

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఉపాధిహామీ పనుల నిర్వహణపై కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో పలు ఎజెండాలను వివరించారు. గ్రామాల్లో ప్రజల ఆధార్‌కార్డు ఆన్‌లైన్లో అనుసంధానం, 100శాతం ట్యాక్సీ వసూళ్లు, ఉపాధిహామీ లేబర్ రిపోర్టు, పారిశుధ్య పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఎంపీడీవో, ఎస్సై

దహెగాం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, ఎస్సై సనత్‌కుమార్‌లు అన్నారు. సోమవారం పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ఇట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను ఉచితంగా అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పది పరీక్షలు వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. పుప్పాల మల్లక్క ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురారీ, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని చిర్రకుంట సెక్టార్, పాడిబండ గ్రామపంచాయతీ, ఆర్ఆర్ కాలనీ (వట్టివాగు) అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోంబాయి పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాడిబండ సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ శంకర్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, కారోబార్ కైలాస్, అంగన్‌వాడీటీచర్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న సంపత్‌కుమార్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న సంపత్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నీలం సంపత్ కు మార్ వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సోమవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. విశ్వవిద్యాలయానికి చెందిన వాణిజ్య విభాగం విశ్రాంత ప్రొఫెసర్ సాయిలు పర్యవేక్షణలో సంపత్ కుమార్ 'మార్కెటింగ్ ఆఫ్ పేపర్ ఇన్ ఇండియా –ఎ స్టడీ ఆఫ్ సిర్పూర్ పే పర్ మిల్స్' అనే అంశంపై చేసిన పరిశోధన కు గాను ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది.

ఉద్యోగికి స్వీయ రక్షణ ముఖ్యం

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతీ కార్మికుడు, ఉద్యోగికి స్వీయ రక్షణే ముఖ్యం అని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనిపై సోమవారం నిర్వహించిన సేఫ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ ఆడిట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి పని స్థలాల్లో వ్యక్తిగత రక్షణ పరికరాలను ఎల్లప్పుడూ ధరించి ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్, రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ

దండేపల్లి: మండలంలోని ధర్మరావ్‌పేటలో స్వచ్ఛభారత్ మిషన్ పై సోమవారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ రాజేందర్, ఎంపీడీవో మల్లేశం మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు తెలియజెప్పాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రతీ ఇంటా మరుగుదొడ్డి నిర్మాణం తప్పనిసరి, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో సామాజిక చిత్రపటాన్ని గీశారు.

భయం..భయం!

- ఆరెగూడలో పిచ్చికుక్కల స్వైరవిహారం
- పట్టించుకోని అధికారులు



ఆరెగూడలో సంచరిస్తున్న కుక్కలు

కాగజ్‌నగర్‌రూరల్: పిచ్చికుక్కల స్వైరవిహారంతో మండలవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి కుక్కలు వచ్చి దాడి చేస్తాయోనని భయంభయంగా ఉంటున్నారు. ఏ వీధిలో చూసినా మందలుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. రోజురోజుకూ కుక్కల బెడద తీవ్రంగా మారడంతో భయాందోళనకు గురవుతున్నారు.

జంకుతున్న జనం..

మండలంలోని ఆరెగూడ గ్రామంలో పిచ్చికుక్కల బెడద తీవ్రంగా ఉంది. సుమారు 50 నుంచి 60 పిచ్చికుక్కలు గ్రామంలోని వీధుల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో గ్రామస్తులు ఒంటరిగా వీధుల్లోకి రావడానికి జంకుతున్నారు. కర్ర చేతిలో లేనిదే బయటకు రావడం లేదు. రాత్రిళ్లు వీటి బెడద మరింత తీవ్రంగా ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నివారించాలని పలుసార్లు గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పలు ఘటనలు..

ఈనెల 5న మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.12 గ్రామానికి చెందిన క్రితిక బరాగి అనే చిన్నారిపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. తాజాగా ఆదివారం మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన రోహిని మంగ అనే మహిళపై పిచ్చికుక్క దాడి చేయగా, తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

భయంగా ఉంది



మా ఊరిలో పిచ్చికుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయి. ఈ మధ్యనే మా ఊరికి చెందిన రోహిని మంగ ఇంటి ముందు కూర్చొని ఉండగా పిచ్చికుక్క దాడి చేసింది. వాటి జోలికి వెళ్లకున్నా వెంటపడి మరీ కరుస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ కుక్క వచ్చి కాటు వేస్తుందోనని భయాందోళన చెందుతున్నాం. – చౌదరి తానుబాయి, ఆరెగూడ

కర్ర లేనిదే బయటకు వెళ్లడం లేదు



బయటకు వెళ్లాలంటే చేతిలో కర్ర ఉండాల్సిందే. లేదంటే కుక్కలు వెంటపడుతున్నాయి. గుంపులుగా కుక్కలు వీధుల్లో తిరుగుతున్నాయి. పశువులను కూడా కరుస్తున్నాయి. – రోహిని విశ్వనాథ్, ఆరెగూడ

అవగాహన కల్పించాలి

కోటపల్లి: క్షయ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ సత్యనారాయణ సూచించారు. క్షయ నివారణకు నిర్ధారణ టెస్టులు, మందులు సక్రమంగా వాడేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.